ప్రజాశక్తి

ఆదివారం 16 జులై 2023 5

శ్రీ సత్యసాయి



ఖైదీలకు నాణ్యమైన భోజనం అందించాలి

జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి-హిందూపురం

సబ్ జైలులో ఉంటున్న ఖైదీలకు నాణ్యమైన భోజనం అందించాలని స్థానిక అదనపు జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి సబ్ జైలు అధికారులను ఆదేశించారు. ఆమె శనివారం స్థానిక సబ్ జైలును సందర్శించి ఖైదీల నుంచి పలు విషయాలు తెలుసుకున్నారు. అనంతరం ఖైదీల గదులు, ఆహార పదార్థాలు, నిత్యవసరాలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆవేశంలో తప్పులు చేసి జైలుకు రావడం వల్ల కుటుంబాలకు తీవ్ర అవమానంగా ఉంటుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని జైలు నుంచి బయటకు వెళ్లిన తర్వాత పరివర్తన రావాలన్నారు. అనంతరం జైలు అధికారి అంజినాయక్‌తో కలిసి పలు రికార్డులను పరిశీలించారు. జడ్జి వెంట న్యాయవాది నరసింహమూర్తి, లోక్ అదాలత్ శారద, తదితరులు ఉన్నారు.

ఇక్బాల్, నవీన్ భేటీ.!

'పురం' అధికార పార్టీలో రాజకీయ వేడి

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర రాజకీయాల్లోనే హిందూపురం నియోజకవర్గానికి ఓ ప్రత్యేకత ఉంది. ఇక్కడి నుంచి అసెంబ్లీ స్థానానికి పోటీ చేసి గెలుపొందిన వారు ముఖ్యమంత్రిగా పని చేయడంతో పాటు ప్రస్తుత ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కావడమే అందుకు ముఖ్య కారణం. అలాంటి ఈ స్థానంలో అధికార పార్టీలోని ఇద్దరు ఉద్దండులు గత అసెంబ్లీ ఎన్నికల నుంచి రాజకీయ శత్రువులుగా ఉన్నారు. తూర్పు, పడమర అన్న చందంగా ఉన్న వారిద్దరూ శనివారం ఓ వైసిపి కౌన్సిలర్ ఇంట్లో చేతులు కలిపారు. వారే ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్, ఎపి ఆగ్రోస్ ఛైర్మన్ నవీన్ నిశ్చల్.. హిందూపురంలో శనివారం ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపి తరఫున హిందూపురం ఎమ్మెల్యే టికెట్ ఆశించిన నవీన్ నిశ్చల్‌కు అధిష్టానం నిరాకరించి స్థానికేతరుడైన షేక్ మహమ్మద్ ఇక్బాల్‌ను బరిలో దింపింది. అప్పటి నుండి ఇద్దరి మధ్య రాజకీయ వైరం నెలకొంది. అసెంబ్లీ ఎన్నికల్లో నందమూరి బాలకృష్ణ చేతిలో ఓటమి పాలైన ఇక్బాల్‌ను అధిష్టానం ఎమ్మెల్సీగా నియమించింది. ఆ ఎన్నికల్లో నవీన్ సహకరించ లేదని ఇక్బాల్ నేరుగా అధిష్టానానికి సైతం ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి ఇద్దరి మధ్య రాజకీయ వైరం తీవ్ర స్థాయికి చేరింది. ఇదిలా ఉండగా అధిష్టానం ఇక్బాల్‌కు నియోజకవర్గ బాధ్యతలను రెండోసారి అప్పగించగా, నవీన్‌ను ఎపి ఆగ్రోస్ ఛైర్మన్‌గా నియమించింది. అయితే పురంలో పట్టు కోసం ఒకరికొకరు తీవ్రంగా వ్యతిరేకించుకున్నారు. పార్టీ కేడర్ మొత్తం ఇక్బాల్, నవీన్ వర్గీయులుగా విడిపోయారు. ఎన్నో సందర్భాల్లో ఇరువర్గాల కార్యకర్తలు కొట్టు కొన్న సంఘటనలూ నెలకొన్నాయి. అయితే ఇటీవల నియోజకవర్గ సమన్వయకర్తగా దీపికావేణురెడ్డిని పార్టీ అధిష్టా నం నియమించింది. దీంతో ఇక్బాల్ వర్గం దీపికకు సహకరించకపోగా ఆమె నిర్వహిస్తున్న పార్టీ అధికారిక కార్యక్రమా లకు సైతం దూరంగా ఉంటున్నారు. శత్రుకు శత్రువు మిత్రుడు అన్నట్లు పార్టీలో ముఖ్య నేత, మంత్రి పెదిరెడ్డి రామంద్రారెడ్డికి నవీన్‌కు మొదటి నుంచి పడదు. ఈ నేపథ్యంలో ఇక్బాల్‌కు ఇదే సంఘటన ఎదురుకావడంతో ఇద్దరు రాజకీయ శత్రువులు నేడు మిత్రులుగా మారడంతో పురం రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. మొదటి నుంచి వైరి వర్గాలుగా ఉన్న ఇక్బాల్, నవీన్ చేతులు కలపడం పురం రాజకీయాల్లో సంచలనం రేకెత్తిస్తోంది. అంతే కాకుండా వర్గ విభేదాలు వీడి 2024 ఎన్నికల్లో పురంలో వైసిపి జెండా ఎగురవేస్తాం అంటూ ఇరువురూ ప్రకటించడం విశేషం. ఓ వైపు నూతన సమన్వయకర్తగా దీపికా వేణు రెడ్డిని అధిష్టానం నియమించిన నేపథ్యంలో వారిద్దరూ ఆమెతో కలిసి కార్యక్రమాల్లో పాల్గొనకుండా వేరుగా కలిసి విభేదాలు వీడి పార్టీని గెలిపిస్తాం అంటూ మీడియా ముందు పేర్కొనడం గమనార్హం. అయితే ఈ విషయంపై అధిష్టానం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాలి.



భేటీ అనంతరం బయటకు వస్తున్న ఇక్బాల్, నవీన్ నిశ్చల్

గెలుపే లక్ష్యంగా ముందుకెళ్తాం : ఇక్బాల్, నవీన్ నిశ్చల్

2024 ఎన్నికల్లో హిందూపురంలో వైసిపి గెలుపే లక్ష్యంగా పని చేస్తామని ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్, ఎపి ఆగ్రోస్ ఛైర్మన్ నవీన్ నిశ్చల్ తెలిపారు. బాలకృష్ణను ఇంటికి సాగనంపుతామన్నారు. స్థానిక త్యాగరాజనగర్‌లోని వైసిపి నేత ఇంట్లో శనివారం ఆ నాయకుడు ఇచ్చిన తేనేటి విందులో ఇక్బాల్, నవీన్ పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఆ ఇద్దరు కలిసి పాత్రికేయులతో మాట్లాడుతూ పార్టీ అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి కలిసి పనిచేస్తామని, పార్టీ నిర్ణయమే శిరోధార్యమన్నారు. హిందూపురంలో ఎలాంటి గ్రూపులు లేవని, ఉన్నదల్లా సిఎం వైఎస్ జగన్ గ్రూపు ఒక్కటే అన్నారు. హిందూపురం టిడిపికి ఇసుక కోట మాత్రమేనని, 2004లో వైసిపి జెండా ఎగరేసి, సిఎం జగన్‌కు బహుమతిగా ఇస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ ఛైర్మన్ జబివుల్లా, కౌన్సిలర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

17న ఎస్‌కెయు స్నాతకోత్సవం

- ◆ ఛాన్సలర్ హోదాలో రాష్ట్ర గవర్నర్ రాక
- ◆ డాక్టర్ జికె.మహంతేష్‌కు గౌరవ డాక్టరేట్
- ◆ 57 మంది విద్యార్థులకు బంగారు పతకాలు
- ◆ 9150 పట్టాలు పంపిణీ
- ◆ ఎస్‌కెయు విసి మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం



శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం 21వ స్నాతకోత్సవం ఈ నెల 17న ఉదయ 10.30 గంటలకు ప్రారంభం అవుతుందని ఎస్‌కెయు ఉపకులపతి రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఛాన్సలర్ హోదాలో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ హాజరు అవుతార న్నారు. స్నాతకోత్స వానికి సంబం ధించిన ఏర్పాట్లపై శనివారం స్థానిక వర్సటీ పరిపాలన భవ నంలో విసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2002లో ఎస్‌కెయులో జరిగిన స్నాతకోత్సవానికి అప్పటి గవర్నర్ సుర్జీత్‌సింగ్ బర్నాలా హాజరయ్యారన్నారు. ఆ తర్వాత గవర్నర్లు స్నాతకోత్స వానికి హాజరు కాలేదన్నారు. రెండు దశాబ్దాల తరువాత ప్రస్తుతం గవర్నర్ స్నాతకోత్స వానికి విచ్చేస్తున్నారని చెప్పారు. గవర్నర్‌తో పాటు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్సా సత్యనారాయణ, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె.హేమచంద్రారెడ్డి, తదితరులు హాజరవుతారన్నారు. 21 స్నాతకోత్సవం సందర్భంగా యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను బెంగళూరుకు చెందిన ప్రముఖ సమర్థన దివ్యాంగుల సంస్థ వ్యవస్థాపక నిర్వహణ ధర్మకర్త డాక్టర్ జికె.మహంతేష్‌కు ఇస్తున్నట్లు చెప్పారు. 9150 మంది విద్యార్థులకు యూజీ, పీజీ డిగ్రీ పట్టాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. 57 మంది ప్రతిభా విద్యార్థులకు బంగారు పతకాలు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. పీజీ విద్యార్థులు 285 మందికి, ఎంఫిల్, పిహెచ్‌డి విద్యార్థులు 71 మందికి పట్టాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. స్నాతకోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించడానికి ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

గవర్నర్ పర్యటన ఇలా..

గవర్నర్ 17న ఉదయం 9.30 గంటలకు వర్సిటీలోకి ప్రవేశిస్తారు. అక్కడ శ్రీకృష్ణదేవరాయ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తారు. అనంతరం రూ.3 కోట్లతో నిర్మించిన ఇంజినీరింగ్ కాలేజ్ అకడమిక్ బ్లాక్‌ను ప్రారంభిస్తారు. అక్కడే రూ.3.50 కోట్లతో నిర్మించిన మెన్ హాస్టల్, రూ.50 లక్షలతో నిర్మించిన మెస్‌హాల్, 60 అడుగులు రోడ్డును ప్రారంభిస్తారు. అనంతరం స్నాతకోత్సవం జరుగుతున్న భువన విజయం ఆడిటోరియంకు చేరుకుని ఆ కార్యక్రమంలో పాల్గొంటారు.



స్నాతకోత్సవం, గవర్నర్ పర్యటన ఏర్పాట్లపై విసితో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి



విలేకరులతో మాట్లాడుతున్న విసి రామకృష్ణారెడ్డి

అధికారుల పరిశీలన

స్నాతకోత్సవ కార్యక్రమానికి గవర్నర్ వస్తున్న నేపథ్యంలో పలువురు అధికారులు ఎస్‌కెయులో పర్యటించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. డిఐజి అమ్మిరెడ్డి, కలెక్టర్ గౌతమి, ఎస్పీ శ్రీనివాసులు ఏర్పాట్లను పరిశీలించి, విసితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ లక్ష్మయ్య, ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, పిఆర్‌ఒ రాంగోపాల్ పాల్గొన్నారు.

డిఎంహెచ్ఒ ఆకస్మిక తనిఖీ

రొద్దం : మండల పరిధిలోని సానిపల్లి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ కృష్ణారెడ్డి శనివారం నాడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అంగన్వాడీ సెంటర్ జరుగుగుతున్న వ్యాధి నిరోధక టీకాలు పరిశీలించారు. పెద్దమంతూరు సచివాలయం పరిధిలోని లక్కసానిపల్లి గ్రామాన్ని సందర్శించి ప్రజలతో మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బదిలీ అయిన ఇద్దరు ఉద్యోగులను సన్మానించారు. ఈ కార్యక్రమం డాక్టర్ ఎం.జగదీష్ బాబు పాల్గొన్నారు.

కమీషన్లకే ఎమ్మెల్యే ప్రాధాన్యత

ఆయనతో ప్రాణహాని ఉంది

విలేకరుల ఎదుట కన్నీళ్లు పెట్టుకున్న రొళ్ల ఎంపిపి కవిత

ప్రజాశక్తి-రొళ్ల

మడకశిర ఎమ్మెల్యే అభివృద్ధిని పక్కన బెట్టి కమీషన్లకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎంపిపి కవిత ఆరోపించారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే తిప్పేస్వామి అవినీతిని ప్రశ్నిస్తున్నందుకు తమపై కక్షగట్టారన్నారు. ఎమ్మెల్యే అవినీతిపై సిబిఐ, సిఐడి విచారణ జరిపిస్తే వాస్తవాలు బహిర్గతం అవుతాయన్నారు. తన భర్తపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో సిమెంట్ అక్రమాల్లో ఎమ్మెల్యే ప్రధానపాత్ర పోషిస్తున్నారని చెప్పారు. ఈ అక్రమాలకు సహకరించలేదని పలువురు ఇంజినీర్లను అకారణంగా సస్పెండ్ చేయించారన్నారు. అంగన్వాడీ ఉద్యోగాల్లో ఎమ్మెల్యే తిప్పేస్వామి రూ.10 వేల నుంచి లక్షల్లో డబ్బులు డిమాండ్ చేశారన్నారు. అదనంగా ఎవరు డబ్బులు ఇస్తే వారికే అంగన్‌వాడీ ఉద్యోగాలు ఇచ్చారన్నారు. వేరుశనగ మినీకిట్స్‌ను సైతం ఎమ్మెల్యే పక్కదోవ పట్టించారన్నారు. ఇలాంటి వాటిని ప్రశ్నిస్తున్నందుకు తన భర్తపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి నుంచి తన కుటుంబానికి ప్రాణహాని ఉందని ఆమె కన్నీళ్లు పెట్టుకున్నారు. ఎంపిపి భర్త విజయరంగే గౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎమ్మెల్యే తిప్పేస్వామి ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే అక్రమాల్లో తాము చేయి కలపలేదన్న ఉద్దేశంతో తమపై కక్ష కట్టారన్నారు. అక్రమ కేసులు పెట్టి అచివేయడానికి ఆయన చూస్తున్నారని మండిపడ్డారు. సీఎం రిలీఫ్ ఫండ్ 1500 మందికి మంజూరు అయితే కేవలం 113 మాత్రమే ఇచ్చారన్నారు. ఎమ్మెల్యే అవినీతి చర్యలతో తాము మండలంలో ప్రజల ముందు తలఎత్తుకుని తిరుగలేకున్నామని తెలిపారు. ఎమ్మెల్యే తీరుపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలు బహిర్గతం చేయాలని కోరారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం

గోరంట్ల 'రెవెన్యూ'పై పలు విమర్శలు



గోరంట్ల తహశీల్దార్ కార్యాలయం

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష, గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాల ద్వారా ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశిస్తోంది. ఈ కార్యక్రమాలకు తూట్లు పొడిచేలా గోరంట్లలోని కొన్ని శాఖ అధికారులు ప్రవర్తిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. రైతులు, కార్మికులు, ధ్రువపత్రాలు, రేషన్‌కార్డుల కోసం తహశీల్దార్ కార్యాలయానికి వెళ్తున్న వారికి కనీసం సమాచారం ఇచ్చే వారు ఉండరనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ప్రజల సమస్యను అడిగి తెలుసుకునేందుకు రెవెన్యూ ముఖ్య అధికారులు ప్రాధాన్యతను ఇవ్వకుండా, నాయకుల సిఫార్సులు ఉన్న వారికి మాత్రమే తహశీల్దార్ కార్యాలయంలో పనులు జరుగుతున్నాయనే విమర్శలున్నాయి. తహశీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యలను పక్కనపెట్టి రియల్టర్లు, దళారుల హవా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. దళారులు గంటల తరబడి తహశీల్దార్ కార్యాలయంలో తిష్ట వేసుకుని కూర్చొంటున్నారు. అధికారులు కూడా వారికి తగిన ప్రాధాన్యత ఇస్తున్నారు. రెవెన్యూ కార్యాలయం ముఖ్య అధికారులు ప్రజల సమస్యను కనీసం వినేందుకు కూడా ఇష్టపడడ లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల కొందరు రేషన్ కార్డు మంజూరు, మార్పులు, చేర్పుల నిమిత్తం తహశీల్దార్ కార్యాలయంలో అర్జీలు ఇస్తే వాటిని పట్టించుకోలేదు. తన కుటుంబ సభ్యులను హౌస్ హోల్డ్ మ్యాపింగ్ చేయకుండా వాలంటీర్లు సంవత్సరాలు గడిపేశారని ఈసమస్యను పరిష్కరించాలని ఓ వ్యక్తి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోలేదు. కమ్మవారిపల్లి సచివాలయంలో ఒకరు రేషన్‌కార్డు మార్పులు, చేర్పుల విషయంలో అర్జీ పెట్టుకున్నాడు. ఈ సమస్య తహశీల్దార్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉందని తెలుసుకున్న ఆ వ్యక్తి రెవెన్యూ ముఖ్య అధికారి వద్దకెళ్లినా ఫలితం లేకపోయింది. ఇలా వన్‌బి, ఇతర ధ్రువీకరణ పత్రాల కోసం నిత్యం అనేక మంది తహశీల్దార్ కార్యాలయానికి వస్తున్నారు. చాలా మంది నెలల తరబడి తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రజలకు సహకరించకుండా విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం

కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే వారికి అవసరమైన ప్రోత్సాహం అందించాలని కలెక్టర్ అరుణ్ బాబు ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా స్టాండప్ ఇండియా పిఎంఈజిపి కింద పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే వారికి రుణాలు ఇచ్చే విధంగా చూడాలన్నారు. సింగల్ డెస్క్ పోర్టల్‌లో పెండింగ్ కేసులను గడువులోగా పరిష్కరించాలని ఎలాంటి పెండింగ్ లేకుండా పరిష్కరించాలన్నారు. పరిశ్రమల అభివద్ధి పాలసీ 2020- 23 కింద బీసీ ఉమెన్, మెన్ కేటగిరి కింద 9 క్లైమ్‌లకు మూలధన పెట్టుబడి సబ్సిడీ మంజూరుకు కమిటీ ఆమోదించింది. జగనన్న బడుగు వికాసం కింద ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు సంబంధించి 16 క్లైమ్‌లకు మూలధన పెట్టుబడి సబ్సిడీ మంజూరుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఒక ప్రొడక్ట్ కింద ధర్మవరం పట్టు చీరల పావడాలు ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఆ యూనిట్ల సక్రమంగా పనిచేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల మేనేజరు చాంద్ బాషా, విద్యుత్ శాఖ డిఈఈ మోసెస్, పర్యావరణ అధికారి కిషోర్ రెడ్డి, సాంఘిక సంక్షేమ డిడి శివ రంగ ప్రసాద్, ఫైనాన్స్ కార్పొరేషన్ బ్రాంచ్ మేనేజర్ వెంకట్ మహేష్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



అధికారులు, బ్యాంకర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

కల్వర్టు నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-కదిరి టౌన్

మండల పరిధిలోని ఎగువపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న కల్వర్టు పనులకు ఎమ్మెల్యే సిద్ధారెడ్డి శనివారం నాడు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎగువపల్లి చెరువు మరవ పారితే ఆ దారి గుండా రాకపోకలు సాగించేందుకు వీల్లేకుండా పోతుందన్నారు. దీంతో గ్రామస్తుల కోసం కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టామన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సహకారంతో కదిరి నియోజకవర్గంలో అనేక గ్రామాలకు రోడ్లు, కల్వర్టు పనులు చేపట్టినట్లు చెప్పారు.

అమ్మాయిల భద్రతపై అవగాహన

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఆర్ఎస్‌వైఎఫ్, ఎఐఎస్ఎ ఆధ్వర్యంలో అమ్మాయిల భద్రత, ఈవ్-టీజింగ్, ర్యాగింగ్ నిర్మూలనపై అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి చిన్నికృష్ణ పాల్గొన్నారు. విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా ఆకతాయిలు అసభ్యంగా ప్రవర్తిస్తే వెంటనే పోలీసు డయల్-100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు మునికుమారి, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ కదిరి నియోజవర్గ కార్యదర్శి తుమ్మల ఇలియాజ్, ఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు అరుణ్ కుమార్, ఎఐఎస్ఎ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి నరసింహరాజు పాల్గొన్నారు.

అధ్వానంగా భీమరాయనపల్లి రోడ్డు

ప్రజాశక్తి-మడకశిర

మండలంలోని పలు గ్రామాల రోడ్లు రాకపోకలకు వీలులేకుండా ఆధ్వానంగా తయారు అయ్యాయి. మండల పరిధిలోని చందకచర్ల పంచాయతీ భీమారాయనపల్లి గ్రామానికి 2017లో సిమెంట్ రోడ్డు వేశారు. ఈరోడ్డు ప్రస్తుతం గుంతల మయం అయ్యింది. రోడ్డుకు అనుసంధానంగా ఏర్పాటు చేసిన మురుగునీటి కాలువలు నిండిపోయి రోడ్డుపైనా మురుగునీరు అంతా ప్రవహిస్తోంది. దీనిపై రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు రోడ్డుపై గుంతల్లో అదుపు తప్పి కింద పడుతున్నారు. రహదారి సమస్యను పరిష్కరించాలని పలుమార్లు గ్రామస్తులు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఓట్ల కోసం వచ్చే నాయకులు అభివృద్ధి గురించి మాత్రం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి భీమరాయనపల్లి గ్రామానికి మెరుగైన రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



రోడ్డుపై నిలిచిన మురుగునీరు

అంగన్వాడీ కేంద్రం తనిఖీ

రొద్దం: మండలంలోని లోచెర్ల, పెద్దకోడిపల్లి, భూచెర్ల, సెంటర్స్‌ను సీడీపీవో శాంతలక్ష్మి శనివారం నాడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె అంగన్‌వాడీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. సెంటర్లను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అంగనవాడీ కార్యకర్త ప్రతిరోజూ సమయపాలన పాటించాలన్నారు. విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శాంతలక్ష్మి, అనురాధ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

17న బిసిల సమావేశం

ఓబుళదేవరచెరువు: బిసిల హక్కులపై ఈ నెల 17వ తేదీ పుట్టపర్తిలో నిర్వహించనున్న సమావేశానికి రాష్ట్రంలోని బిసిలంద రూ కదలిరావాలని బిసి హక్కుల పోరాట సమితి పుట్టపర్తి అధ్యక్షులు ఎంఎస్ షబ్బీర్ పిలుపునిచ్చారు. ఓబుళ దేవరచెరువులో శనివారం ఆయన మాట్లాడుతూ బిసిల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు జోడిం రాజశేఖర్ అధ్యక్షతన పుట్టపర్తిలో సోమవారం ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. నాలుగేళ్లలో బిసిలపై అనేక దాడులు జరిగాయన్నారు. దీనికి తోడు బిసిలకు రిజర్వేషన్ పెంచే విషయంపై ప్రభు త్వం స్పందించలేదన్నారు. ఆయా సమస్యలతోపాటు భవిష్యత్తు కార్యాచరణపై చర్చ ఉంటుందన్నారు. కార్యక్ర మంలో రామచంద్ర, పెద్దన్న, బాబు పాల్గొన్నారు.

వివాహానికి ఆర్థికసాయం


కొత్తచెరువు : స్థానిక బీసీ కాలనీకి చెందిన శంషాద్ నజీర్ కుమార్తె చాందిని వివాహ ఖర్చుల కోసం దర్గా కమిటీ మేనేజర్ అతావుల్ రహిమాన్ శనివారం స్థానిక మస్తాన్‌వలి దర్గా వద్ద రూ. 5 వేల చెక్కును అందజేశా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ముస్లింలకు తమ వంతు ఆర్థిక సాయం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో షాదీ మహల్ ఉపాధ్యక్షులు తయూబ్‌ఖాన్, వైసిపి నాయకులు మహబూబ్‌బాషా, ఇమామ్, ధూపంపల్లి బాషా, అకౌంటెంట్ నూర్, మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందుబాటులో ఉంచాలి

◆ అన్ని మున్సిపాల్టీల్లో ప్రభుత్వ స్టాల్స్ ఏర్పాటు ◆ జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

నిత్యావసరాల ధరలు వినియోగదారులకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్ హోల్‌సేల్, రైస్‌మిల్లర్స్ యజమానులను ఆదేశించారు. శనివారం పుట్టపర్తి కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో హోల్‌సేల్, రైస్‌మిల్లర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల పరిధిలో స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు సోనామసూరి, కందిపప్పును విక్రయించాలని ఆదేశించారు. ప్రభుత్వం సోనామసూరి, బిటిపి బియ్యాన్ని కేజీ 44 రూపాయలకు, కందిపప్పు కేజీ 135 రూపాయలకు విక్రయించాలని సూచించిందని, అందుకు అనుగుణంగా జిల్లాలోని అర్బన్ ప్రాంతాల్లో ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. నిత్యావసర వస్తువులు బయట మార్కెట్లో ఎక్కువ ధరలు ఉన్నాయని, ప్రయివేటు కన్నా తక్కువగా ప్రభుత్వ స్టాల్స్‌లో సోనామసూరి, కందిపప్పును అమ్మాలన్నారు. స్టాల్స్ వద్ద బ్యానర్ల ద్వారా ధరలు ప్రదర్శించాలన్నారు. బయట మార్కెట్లో నిత్యవసరాల ధరలు పెరుగుతున్నాయని, ధరలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో డిఎస్ఓ వంశీకష్ణ, మార్కెటింగ్ ఏడీ మూర్తి, హిందూపురం హోల్‌సేల్స్ ఫుడ్ గ్రెయింగ్ డీలర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గోవర్ధన్ గుప్తా, సిఎస్‌డిటిలు, హోల్‌సేల్ మర్చంట్ అసోసియేషన్ వ్యాపారులు పాల్గొన్నారు.



హోల్‌సేల్ వ్యాపారులు, రైస్‌మిల్లర్లతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్


టిడిపి ప్రచార వాహనం ప్రారంభం

ప్రజాశక్తి-హిందూపురం

టిడిపి ప్రకటించిన 'మహాశక్తి' పథకాలను నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం చేయడంలో భాగంగా ప్రత్యేక ప్రచార వాహనాన్ని శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే బాలకృష్ణ నివాసం వద్ద టిడిపి నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లందుకు మహాశక్తి వాహనం యాత్రను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షులు డీఈ రమేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శులు రామాంజనమ్మ, కొల్లకుంట అంజనప్ప, రూరల్ మండల కన్వీనర్ అశ్వర్థరెడ్డి, రావెళ్ల లక్ష్మి, అనిల్ కుమార్, తెలుగు మహిళా రాష్ట్ర కార్యదర్శి పరిమళ, పార్లమెంటు ఉపాధ్యక్షులు శ్రీదేవి, కార్యదర్శి చెన్నమ్మ, పట్టణ తెలుగు మహిళా అధ్యక్షులు విజయలక్ష్మి, రాష్ట్ర అంగన్వాడీ కార్యదర్శి వెంకటలక్ష్మి, నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు మాలక్క, కౌన్సిలర్లు మంజుల, మహాలక్ష్మి, భారతి, గీతమ్మ, రాఘవేంద్ర, నాయకులు ఆదినారాయణ, అమర్‌నాథ్, దుర్గా, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ రగడ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



ఎన్నికలకు సమయం ఆసన్నమవుతున్న కొద్ది రాజకీయాలు వేడెక్కుతున్నాయి. నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. అంతటితోనే కాకుండా తాడిపత్రి వంటి ప్రాంతాల్లో రగడలకు దారితీస్తున్నాయి. ఇంక సమయం దగ్గరపడే కొద్ది ఇవి ఏ స్థాయికి చేరుతాయోనన్న ఆందోళన నెలకొంటోంది. ఈ వారంలో చూస్తే తాడిపత్రి నియోజకవర్గంలోని రాజకీయాలు వేడి పుట్టిస్తున్నాయి. తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. ఈ ఇరు కుటుంబాల మధ్య ముందు నుంచి ముఠా తగాదాలున్న విషయం తెలిసిందే. 1980 దశకం నాటి నుంచి ఈ రెండు కుటుంబాల మధ్య ముఠా పోరు నడుస్తూవస్తోంది. ఇందులో అనేక మంది తగాదాల్లో బలైపోయిన వారూ ఉన్నారు. ఇటువంటి తగాదాల్లో 2004లో కేతిరెడ్డి పెద్దారెడ్డి సోదరుడు కేతిరెడ్డి సూర్య ప్రతాప్‌రెడ్డి హత్యకు గురయ్యారు. అప్పటి నుంచి ఆ కుటుంబం తాడిపత్రిలో కాకుండా ధర్మవరంలో ఉంటూ రాజకీయాలు చేస్తూ వచ్చింది. అయితే 2019లో వైఎస్.జగన్మోహన్‌రెడ్డి కేతిరెడ్డి పెద్దారెడ్డిని తాడిపత్రి నుంచి బరిలో దింపారు. అప్పటి వరకు అంటే 1985 నుంచి 2014 ఎన్నికల వరకు ఓటమన్నది ఎరుగకుండా జెసి కుటుంబం విజయం సాధిస్తూ వచ్చింది. తొలిసారిగా 2019లో ఆ కుటుంబం ఓటమిని చవిచూసింది. దీంతో మూడు దశబ్దాల తరువాత ఆ కుటుంబానికి స్థానికంగా అధికారం కోల్పోవలసి వచ్చింది. అయితే ఆ తరువాత మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొంది జెసి.ప్రభాకర్‌రెడ్డి మున్సిపల్ ఛైర్మన్ అయ్యారు. ఈ పదవి రావడంతో తాడిపత్రి పట్టణంలో ఇద్దరి మధ్య అధికారం చెలామణిలో తరచూ సమస్యలు రావడం మాటల యుద్ధం కొనసాగుతూనే ఉంటూ వస్తోంది. ఈ నేపథ్యంలో పంటలబీమాలో అక్రమంగా పరిహారాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి పొందారని జెసి.ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. దీనికి ఆయన ప్రతిస్పందించడంతో తాడిపత్రి రాజకీయాలు మరోమారు వేడెక్కాయి. ఇదే సమయంలో నియోజకవర్గంలో వరుసగా రెండు రోజులు టిడిపి, వైసిపి నాయకులు దాడులు చేసుకోవడం గాయాలపాలై ఆసుపత్రుల్లో చేరారు. అధికారం అడ్డుపెట్టుకుని తమ వారిపై వైసిపి నాయకులు దాడులు చేస్తున్నారని టిడిపి ఆరోపిస్తోంది. ముందు నుంచి ఈ ప్రాంతం ఫ్యాక్షన్ ముద్రపడినది కావడంతోపాటు, మారుతున్న రాజకీయ పరిణామాలు తిరిగి పాత పద్ధతుల్లోకి తీసుకెళుతున్నా అన్న ఆందోళన స్థానిక ప్రజల్లో కనిపిస్తోంది. ఇతర ఫ్యాక్షన్ ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులు నివురుగప్పిన నిప్పుల కనిపిస్తున్నాయి. ఫ్యాక్షన్ లేకుండా చేస్తామని, పోలీసులకు స్వేచ్ఛ నిస్తామని ప్రారంభంలోనే ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రకటించియున్నారు. ఇప్పటి వరకు అటువంటి ఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కాని వస్తున్న రాజకీయ పరిణామాలు, వాతావరణం చూస్తే అందరిలోనూ గుబులు నెలకొంటోంది. ముఠా కక్షలకు తావు లేకుండా పోలీసు శాఖ ఎటువంటి చర్యలు తీసుకుంటుందోనన్న చర్చ కూడా నడుస్తోంది. ఏది ఏమైనా ఎన్నికల సమయం సమీస్తున్న కొద్ది ఆధిపత్యపు పోరులు పురుడుపోసుకుంటున్నాయి. వీటిని నియంత్రించే చర్యలు చేపట్టపోతే పరిస్థితులు చేయి దాటిపోయే అవకాశాలూ లేకపోలేదన్న ఆందోళన ఉంది. ప్రజలు ఇప్పటికే అనేక రకాలైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇటువంటి సమయంలో గ్రామాల్లో ఈ పోరులు మొదలవుతే ప్రజల జీవన ప్రమాణాలు మరింత దిగజారిపోతాయన్న ఆందోళన నెలకొంది.

అధిక ఫీజుల దోపిడీని అరికట్టండి

రౌండ్‌టేబుల్ సమావేశంలో నాయకులు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్


రౌండ్ టేబుల్ సమావేశంలో సంఘీభావం తెలుపుతున్న నాయకులు

పట్టణంలోని ప్రయివేటు స్కూల్స్‌లో అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పోతలయ్య అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, సిపిఎం పట్టణ కార్యదర్శి నాగార్జున, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి విజయ్‌చౌదరి, రైతు సంఘం నాయకులు జెవి రమణ, సిఐటియు నాయకులు అయూబ్‌ఖాన్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజా, ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు కేశగాళ్ల వెంకటేష్, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు వెంకీ, ఇర్షాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకు లు మాట్లాడుతూ పట్టణంలోని ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నార న్నారు. అధికారులు యాజమాన్యాలతో కుమ్మక్కైయ్యా రని మండిపడ్డారు. నిబంధనలను పాటించని పాఠశాలలపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోతే జిల్లావ్యాప్తంగా ఆందోళన లకు దిగుతామని హెచ్చరించారు. సమావేశంలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు శివ, సాయికుమార్, కిరణ్, మనోజ్, జైపాల్, కుళ్లాయిస్వామి, యాసిన్, త్రివిక్రమ్, విజయ్, తిరుమలేష్, ఎస్సీ జన సంఘం నాయకులు ఓబుళపతి, కిరణ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు పట్టుదల, క్రమశిక్షణ ఉండాలి

ప్రజాశక్తి-రొద్దం


సరస్వతి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సబ్ కలెక్టర్ కార్తీక్

విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పెనుకొండ సబ్ కలెక్టర్ కె.కార్తీక్ సూచించారు. మండల పరిధిలోని కోగిర ఉన్నత పాఠశాలలో శనివారం జాబిలి చాంద్‌బాషా ఆధ్వర్యంలో హెచ్ఎం నారాయణ రెడ్డి అధ్యక్షతన సరస్వతి విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించ గా ముఖ్య అతిథులుగా సబ్ కలెక్టర్‌తో పాటు డీఎస్పీ హుస్సేన్‌పీర, డివైఇఒ రంగస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రు లు, ఉపాధ్యాయులు చెప్పిన మాటలు విని వినయ విధేయతలతో మహాత్ము ల అడుగు జాడల్లో నడిచి గొప్పవారు కావాలన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ పోలీసులంటే కొట్టే వారని భయపడ కూడదు.. చట్టం, న్యాయాన్ని పరిరక్షించే అధికారులు అన్నారు. మీరు బాగా చదువుకొని గొప్ప పోలీసు అధికారు లు కావాలని సూచించారు. డివైఇఒ మాట్లాడుతూ కోగిర పాఠశాలలో ఉపాధ్యాయులు, దాతల సహకారంతో సరస్వతి విగ్రహం ఏర్పాటు చేయటం గర్వించదగిన విషయమన్నారు. నిర్వాహకులు జాబిలి చాంద్‌బాషా మాట్లాడుతూ త్వరలో కోగిర జైసీతారాం పేరుమీద గ్రంథాలయం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎస్.నారాయణరెడ్డి, జయసాగర్‌రెడ్డి, రైట్స్ డిస్ట్రిక్ట్ డైరెక్టర్ జాన్ ప్రియనాథ్, దాతలు బి.రమాదేవి రామకృష్ణ, సర్పంచి కోగిర బి.హనుమప్ప, పాఠశాల కమిటీ ఛైర్మన్ బి.గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

'మిషన్ రాయలసీమ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కరపత్రం విడుదల

ప్రజాశక్తి-మడకశిర


కరపత్రాలు విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, తదితరులు

పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శనివారం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షు లు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పే స్వామి 'మిషన్ రాయలసీమ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా గుండుమల మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో టిడిపి విజయమే ధ్యేయంగా పని చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ నాయ కులు నర్సింహా రెడ్డి, కిష్టప్ప, నియోజకవర్గ డాక్టర్ సెల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, తెలుగు యువత అధ్యక్షుడు బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి కోట్ల రంగేగౌడ్, అమిదాలగొంది నర్సేగౌడ, సోషల్ మీడియా కోఆర్డినేటర్ బెగార్లపల్లి రవికుమార్, బిసి సెల్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, డీలర్ రవి, సోము, తదితరుల పాల్గొన్నారు.

చంద్రబాబుకు మడకశిర నాయకుల సన్మానం

టిడిపి అధినేత చంద్రబాబును టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి బిఎస్ గురుమూర్తి మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. గురుమూర్తి, గుండుమల తిప్పేస్వామి అమావాతిలో చంద్రబాబును మర్యాద పూర్వకంగా కలిసి గురుమూర్తికి రాష్ట్ర స్థాయి పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ మరింత బాధ్యతగా పనిచేసి టిడిపి విజయానికి కృషి చేయాలని సూచించారు. చంద్రబాబును కలిసిన వారిలో రాష్ట్ర కార్యదర్శి డా. శ్రీనివాసమూర్తి, పార్టీ పరిశీల కులు పార్థసారథిరెడ్డి, దాసిరెడ్డి, కృష్ణమూర్తి, మనోహర్, తిప్పేస్వామి ఉన్నారు.

కుమారస్వామికి చంద్రబాబు అభినందనలు

మడకశిర నియోజకవర్గంలోని అగలి మండల కన్వీనర్ కుమారస్వామిని చంద్రబాబు అభినందించారు. పార్టీ సమాచారంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి అన్యాయాలను ప్రజలకు చేరేస్తూ 10 వేల పాయింట్లు సాధించడం గర్వించదగ్గ విషయమన్నారు.

టిడిపితోనే సీమ అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

నారా లోకేష్ ప్రకటించిన 'మిషన్ రాయలసీమ'తో సీమ అభివృద్ధి బాట పడుతుందని తెలుగు యువత నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో మిషన్ రాయలసీమ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అంబులెన్స్ రమేష్, నియోజకవర్గ అధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మనోహర్ మాట్లాడుతూ రాయలసీమ భవిష్యత్తుకు భరోసా ఇస్తూ లోకేష్ కడపలో రాయలసీమ డిక్లరేషన్ ప్రకటిం చారన్నారు. ముఖ్యంగా సీమ జిల్లాల్లో పరిశ్రమలు నెలకొల్పి యువతకు ఉపాధి కల్పన, ప్రతి ఎకరాకు సాగునీరు, విత్తినం వేసినప్పటి నుంచి పంట అమ్మే వరకు రైతులకు అండగా ఉంటామని ప్రకటించారన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న తెలుగు యువత నాయకులు


ధర్మవరం టౌన్ : 'మిషన్ రాయలసీమ' హామీ కరపత్రా లను శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో తెలుగు యువ త ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ ఈ హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లి వచ్చే ఎన్నికల్లో టిడిపి గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి చిన్నూరు విజయ్ చౌదరి, నియోజకవర్గ అధ్యక్షుడు మధుసూదన్, నాయకులు అమరా సుధాకర్‌నాయుడు, సంగాల బాలు, తోట వాసుదేవ, తిరుమలేశ్, అనిల్, మహేశ్, లింగప్ప, పవన్, హేమరాజు, ఆఫ్రీద్, కాటమయ్య, నాగరాజు, వినోద్, రమేశ్, వెంకటేష్ పాల్గొన్నారు.

బుక్కపట్నం : టిడిపి ప్రభుత్వంతోనే యువతకు అన్ని విధాలుగా ఉపాధి, ఉద్యోగావకాశాలు దక్కుతాయని తెలుగు యువత నాయకులు తెలిపారు. తెలుగు యువత ఆధ్వర్యంలో శనివారం రాయలసీమ డిక్లరేషన్ హామీ గోడపత్రికలను విడుదల చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అంబులెన్స్ రమేష్, తెలుగు యువత అధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మనోహర్, సుధీర్, సుధాకర్, కృష్ణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా అందరికీ ప్రభుత్వ లబ్ధి

ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి

ప్రజాశక్తి-మడకశిర


ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

రాష్ట్రంలో రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైసిపికే దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి తెలిపారు. మడకశిర మండల పరిధిలోని భీమరాయనిపల్లి గ్రామంలో శనివారం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి ఆరా తీశారు. దేశంలో ఎన్నికల హామీలను వంద శాతం అమలు చేసిన ఏకైక సిఎం జగన్ అని కొనియాడారు. కార్యక్రమంలో కుంచుటిగ ఒక్కలిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ నళినిరంగేగౌడ్, సింగిల్‌విండో అధ్యక్షులు రామిరెడ్డి, స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్లు బిఎల్ రామకృష్ణ, నాగరాజుగౌడ్, ఎంపిపి కవితా సత్యనారాయణరెడ్డి, జడ్పిటిసి సరోజమ్మమూర్తి, బొజ్జప్ప, సర్పంచులు ప్రభావతి దేవలనాయక్, హనుమంత గౌడ్, గీతాఅంజన్‌మూర్తి, ఎంపిటిసిలు శ్రీరామ్‌రెడ్డి, ఎన్ఎన్ మూర్తి, గోపాల్‌నాయక్, మల్లేషప్ప, దివాకర్, సచివాలయ కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

బత్తలపల్లి : వైసిపి ప్రభుత్వం కుల, మతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తుందని వైసిపి నాయకులు కేతిరెడ్డి వెంకటకృ ష్ణారెడ్డి పేర్కొన్నారు. 'గుడ్ మార్నింగ్-ధర్మవరం' కార్యక్రమం లో భాగంగా శనివారం ఆయన ఎపి కురుబ కారొరేషన్ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డితో కలిసి స్థానిక ఇందిరమ్మ కాలనీ, మారుతినగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తాగునీటి సమస్యను వివరించగా త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ఎపిని దేశంలోనే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దారన్నారు. ఇది ఓర్చుకోలేని ప్రతిపక్ష పార్టీలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో మళ్లీ వైసిపిని ఆదరించాలని, ఎమ్మెల్యేగా కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కరీంసాబ్, రామిరెడ్డి, జిక్రియా, షేక్షావలి, సాకే గోపాల్, సంద్రా రామకృష్ణ, కుమ్మర వెంకటరమణ, వాలంటీర్లు, గృహసారథులు, తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు దారి లేక అవస్థలు

చిలమత్తూరు : స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన గోపి శనివారం మృతి చెందాడు. అయితే శ్మశానవాటికకు దారిలేక పోవడంతో పొలం గట్లల నానా అవస్థలు పడుతూ మృతదేహాన్ని మోసుకొని వెళ్లారు. దీనిని కాలనీకి చెందిన కొందరు యువకులు వీడియో తీసి 'తమ అవస్థలు చూడండి'.. ఎన్నికలప్పుడు శ్మశానవాటికకు దారి వేస్తామని హామీ ఇచ్చి గెలిచిన తర్వాత పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు.

అఖిలపక్ష నాయకులతో ఆర్డీవో సమావేశం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్


రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమైన ఆర్డీవో

నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో శనివారం ఆర్డీఓ భాగ్యరేఖ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ ఓటర్ల జాబితా-2024లో భాగంగా బూత్ స్థాయి అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించారన్నారు. కావున గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు ప్రతి బూత్‌కు బిఎల్ఎలను నియమించి సర్వేలో అర్హులైన యువతీ యువకుల ను ఓటర్లుగా నమోదు చేయడం, అనర్హులను తొలగించడం, ఓటరు వివరాల సవరణ, తదితరాలను సరిచేసుకోవచ్చు అన్నారు. అలాగే విభిన్న ప్రతిభావంతులు, థర్డ్ జెండర్ ఓటర్లు, వందేళ్లు పైబడిన వారిని గుర్తించడం, పోలింగ్ బూత్‌ల వివరాలు, సౌకర్యాలు, స్త్రీ, పురుషుల నిష్పత్తి, జనాభా ప్రాతిపదికన ఓటర్ల నిష్పత్తి, యువ ఓటర్ల నమోదు వంటి వాటిని గుర్తించాలని సూచించారు. సమావేశంలో తహశీల్దార్ కె.నవీన్‌కుమార్, ఎన్నికల డిటి కె.నరసింహులు, అధికారులు హరికుమార్, రహిమాన్, తరుణ్‌తేజ, సిపిఎం నాయకులు పైపల్లి గంగాధర్, టిడిపి నాయకులు సామకోటి ఆదినారాయణ, మాల మనోహర్, కె.విజయభాస్కర్, సిపిఐ నాయకులు ఆంజనేయులు, గౌస్లాజం, వైసిపి నాయకులు రంగారెడ్డి, టీ.నరసారెడ్డి, బిఎస్‌పి నాయకులు ఎ.సుబ్బరాయుడు పాల్గొన్నారు.

నవ సమాజ నిర్మాణంలో భాగస్వాములవ్వండి

ప్రజాశక్తి-హిందూపురం



సమావేశంలో మాట్లాడుతున్న ఎడిజె కంపల్లె శైలజ

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ నవ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ పిలుపునిచ్చారు. స్థానిక ఎస్‌డిజిఎస్ కళాశాలలో శనివారం మత్తుపదార్థాల వినియోగం, ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి శైలజ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసలై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు అన్నారు. ప్రతి కళాశాలలో తప్పనిసరిగా ర్యాగింగ్ నివారణ కమిటీ ఉండాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. యువత హద్దులు దాటకుండా, సమాజానికి ఉపయోగపడేలా వ్యవహరించాలని సూచించారు. అనంతరం ర్యాగింగ్, మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల కమిటీ ప్రతినిధులు చంద్రమోహన్, బైసాని రాంప్రసాద్, ప్రిన్సిపల్స్ నాగేంద్రకుమార్, ప్రసాద్, న్యాయవాదులు సుదర్శన్, సుధాకర్, రమేష్, లోక్ అదాలత్ శారద, ఎఎస్ఐ జయరాములు, లైజనింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపురం ఇందిరమ్మ కాలనీ వాసుల ధర్నా

ప్రజాశక్తి -పెనుకొండ


సమావేశంలో మాట్లాడుతున్న ఎడిజె కంపల్లె శైలజ

నగర పంచాయతీ పరిధిలోని తిమ్మాపురం ఇందిరమ్మ కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సిపిఎం నాయకులు రమేష్, టిడిపి కౌన్సిలర్ గిరి, తిమ్మాపురం రియాజ్, కాలనీ ప్రజలు, మహిళలు పెద్దఎత్తున రోడ్డు భైఠాయించి ధర్నా చేపట్టడంతో ట్రాఫిక్ స్తంభించింది. ఈ విషయం తెలుసుకున్న సిఐ కరుణాకర్ సిబ్బందితో అక్కడికి చేరుకొని వారితో మాట్లాడారు. సబ్ కలెక్టర్ ఇక్కడికి వచ్చేంత వరకూ ధర్నా విరమించేది లేదని తెలిపారు. దీంతో సిఐ మాట్లాడుతూ సబ్ కలెక్టర్, డిస్పీ రొద్దంలో ఓ కార్యక్రమానికి హాజరయ్యారని, కమిషనర్ వస్తున్నారని తెలిపాడు. అయినా వారు ససేమిరా అనడంతో సిఐ, పోలీసులు బలవంతంగా రమేష్, గిరి, రియాజ్‌లను ఎత్తుకుని పక్కకు లేపారు. ఇంతలో కమిషనర్, ఛైర్మన్, వైస్ ఛైర్మన్, కౌన్సిలర్లు అక్కడికి చేరుకోగా వారికి సమస్యలను వివరించారు. సమస్యలపై అర్జీ ఇవ్వాలని కమిషనర్ కోరగా అనంతరం వారు నగర పంచాయతీ కార్యాలయం వద్దకు వెళ్లి కమిషనర్ వంశీకృష్ణభార్గవకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో కాలనీ ప్రజలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

'భవిష్యత్తుకు గ్యారెంటీ'తో వైసిపిలో వణుకు

టిడిపి రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

వైసిపి నాలుగేళ్ల పాలనలో ప్రజలు విసిగిపోయారని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో జగన్ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య పేర్కొన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని 29వ వార్డులో నాయకులు ఇంటింటికీ వెళ్లి టిడిపి మేనిఫెస్టోని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తుకు గ్యారెంటీతో వైసిపిలో వణుకు పుట్టగా ప్రజల్లో నమ్మకం ఏర్పడిందన్నారు. నాలుగేళ్ల పాలనలో జగన్ చేసిందేమీ లేదన్నారు. రాష్ట్రం బాగు పడాలంటే చంద్రబాబును సిఎంను చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశా లు రావాలంటే ఒక్క చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో 29వ వార్డు క్లస్టర్ ఇన్‌ఛార్జి ఫణికుమార్, నాయకులు పురుషోత్తంగౌడ్, గోసల శ్రీరాములు, బీరే శ్రీనివాసులు, సీబీఎన్ రామకృష్ణ, పాళ్యం శీన, కేశగాళ్ల శీన, ఎర్రిస్వామి, తిరుపాల్, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు అని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల విజయ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక ఎస్సీ, మైనార్టీ కాలనీల్లో శనివారం ఆయన ఇంటింటికీ వెళ్లి టిడిపి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రకృతి వనరుల దోపిడీ ప్రభుత్వం రాజ్యమేలుతోందని, ప్రశ్నించే ప్రతిపక్షాల గొంతు నొక్కి పైశాచిక ఆనందం పొందుతోందని, ఒక్క ఛాన్స్ అంటూ ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన వైసిపికి వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే మేనిఫెస్టోని తప్పకుండా అమలు చేస్తుందని స్పష్టం చేశారు. ఆయన వెంట స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


ప్రజలకు కరపత్రాలను అందజేస్తున్న టీడీపీనాయకులు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి.. మరొకరికి గాయాలు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని కేతిరెడ్డి కాలనీ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదం లో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని ఇందిరమ్మకాలనీకి చెందిన తోఫిక్(20), స్నేహితుడు నరేష్‌తో కలిసి ద్విచక్రవాహనంపై ఎన్ఎస్ గేటుకు బయల్దేరారు. ఈ క్రమంలో అతివేగంగా వెళ్తూ కేతిరెడ్డి కాలనీ వద్ద అదుపుతప్పి పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొట్టి ఎగిరి పడ్డారు. స్థానికులు వెంటనే ఇద్దరినీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి తోఫిక్ మృతి చెందినట్లు చెప్పారు. తీవ్రంగా గాయపడిన నరేష్‌కు ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. తోఫిక్ ఎలక్ట్రీషియన్ పని చేసేవాడు. పెళ్లికాలేదు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడు ఆత్మహత్య

గోరంట్ల : స్థానిక గాంధీ సర్కిల్‌లోని బేకరీలో పని చేసే తమిళనాడు కు చెందిన మునిరాజు(22) శనివారం బేకరీ దుకాణంపై గదిలో ఉరి వేసుకొని మృతి చెందినట్లు సిఐ సుబ్బరాయుడు తెలిపారు. అతడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

శ్రీసత్యసాయి ఎయిర్ పోర్టు సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. వివరాలు.. స్థానిక ప్రశాంతి గ్రామ్ వద్ద నివా సం ఉంటున్న శివరామప్పనాయుడు(48) శుక్రవారం రాత్రి 8:30 గంటల సమ యంలో కొడుకు, కూతురుతో కలిసి నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో వెనుక నుంచి వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొనడంతో స్పృహ కోల్పోయి పడిపోయారు. దీంతో స్థానికులు హుటాహుటిన సూపర్ స్పెషా లిటీ ఆసుపత్రి తీసుకెళ్లగా వైద్యు లు మెరుగైన చికిత్స కోసం అనంతపురం తీసుకెళ్లాలని సూచించారు. అయితే మార్గమధ్యలో ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా డాక్టర్లు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దీంతో శవ పరీక్షల నిమిత్తం ధర్మవరం హాస్పిటల్‌కు తరలించారు. ఈ సంఘటనకు కారణమైన ద్విచక్ర వాహన దారుడు బీడుపల్లికి చెందిన శివారెడ్డిగా గుర్తించారు. శివరామప్పనాయుడుకి భార్య, ఇద్దరు కూతుర్లు, ఒక కుమా రుడు ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

చిలమత్తూరు : మండల పరిధిలోని కొడికొండ చెక్‌పోస్టు-శిర రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో శెట్టిపల్లి గ్రామనికి చెందిన ఆంజనేయులు గాయపడ్డాడు. ఆంజనేయులు భార్యాపిల్లలతో కలిసి అత్తగారి ఊరైన ఎల్లోడికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా శిర రహదారిపై చిలమత్తూరు మలుపు వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొనడంతో అంజనేయులుకు గాయాల య్యాయి. అలాగే చిన్నారికి స్వల్ప గాయలవడంతో చిలమత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్


వివరాలు వెల్లడిస్తున్న వన్ టౌన్ సిఐ సుబ్రహ్మణ్యం,

కర్నాటక మద్యం విక్రయం, రవాణా, గంజాయి, మట్కా, పేకాట, తదితర అసాం ఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వన్ టౌన్ సిఐ సుబ్రహ్మణ్యం హెచ్చ రించారు. కర్నాటక మద్యం పట్టివేతపై శనివారం ఆయన వన్‌టౌన్ స్టేషన్‌లో విలేఖరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కర్నాటక మద్యం తరలి స్తున్నట్లు పక్కా సమాచారం అందడంతో హెడాకానిస్టేబుల్ నరసింహులు, కానిస్టేబుళ్లు అనిల్, అశ్వర్థనారాయణ, మారుతి, దివాకర్‌లతో కలిసి స్థానిక పార్థసారధినగర్‌లోని సాయిబాబా గుడి క్రాస్ వద్ద ఉదయం వాహనాలు తనిఖీలు చేపట్టామన్నారు. ఈ క్రమంలో కడప జిల్లా సింహాద్రిపురానికి కారులో తరలిస్తున్న రూ. 56,546 విలువ చేసే కర్నాటక మద్యం(టెట్రా ప్యాకెట్లు, బాటిళ్ల)ను స్వాధీనం చేసుకున్నామ న్నారు. అలాగే కటికరెడ్డి మధుసూదన్‌రెడ్డి, కొమ్మ శివలింగారెడ్డిలను అరెస్టు చేసి వారిపై కేసు నమోదు చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తెలిపారు.

కురుబలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి


ప్రజాశక్తి-కొత్తచెరువు


సమావేశమైన కురుబ సామాజిక వర్గం నాయకులు

కురుబ సామాజిక వర్గానికి రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని ఆ సంఘం జిల్లా నాయకులు సామకోటి ఆది నారాయణ, మల్లికార్జున కోరా రు. కొత్తచెరువులోని మల్లికా ర్జున నివాసంలో శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో అన్నిరాజకీయ పార్టీలు కురుబలకు రాష్ట్ర వ్యాప్తంగా 15 ఎమ్మెల్యే, 5 ఎంపి స్థానాలు కేటాయించాలన్నారు. ఏ పార్టీ కురుబలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందో ఆ పార్టీకే తమ మద్దతు ఉంటుందన్నారు. కనకదాసును ఆదర్శంగా తీసుకొని కురుబలు ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శివానంద, చెన్నప్ప, ప్రభాకర్, తలమర్ల కమ్మన్న, రాము, గోరంట్ల కిష్టప్ప, ఆదినారాయణ, బ్రాహ్మణపల్లి కిష్టప్ప, తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో కుల దూషణపై సబ్ కలెక్టర్ విచారణ

పరిగి : మండల పరిధిలోని ఎపిఆర్‌జెసి కళాశాలలో దళిత విద్యార్థులపై లెక్చరర్ సుజాత కుల దూషణకు పాల్పడిం దనే ఉద్దేశంతో విధుల నుంచి తొలగించిన విషయం తెలిసిందే. ఈ సంఘటనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన సహచర అధ్యాపకురాలు సవితరాణిని ప్రిన్సిపల్ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు తొలగించారు. అయితే కుల దూషణకు పాల్పడిన విద్యార్థులపై ఫిర్యాదు చేయడం వల్లే తనను విధుల నుంచి తప్పించారని తనకు న్యాయం చేయాలని సవితరాణి ఎస్సీ ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించింది. ఈ సంఘటనపై పూర్తి విచారణ జరిపి నివేదిక పంపా లని ఎస్సీ ఎస్టీ కమిషన్ కలెక్టర్‌కు ఆదేశాలు పంపడంతో సబ్ కలెక్టర్ శనివారం కళాశాలకు చేరుకుని ఈ సంఘ టనలో ప్రమేయం ఉన్న ప్రతి అధికారిని, విద్యార్థులను విచారణ చేశారు.


ప్రిన్సిపల్ ను విచారణ చేస్తున్న సబ్ కలెక్టర్ కార్తీక్

ఆదరించండి.. అండగా ఉంటాం..

అనంతపురం : వచ్చే ఎన్నికల్లో జనసేన పార్టీని ఆదరిస్తే ప్రజలకు అండగా ఉంటామని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్ విజ్ఞప్తి చేశారు. జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలను వివరిస్తూ చేపట్టిన జనసేన జయభేరి కార్యక్రమం శనివారం నగరంలోని 2వ డివిజన్ పరిధిలోని కల్పనజోష్ కాలనీలో సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో చిత్తశుద్ధి, నిబద్ధత కలిగిన పవన్‌కళ్యాణ్ నాయకత్వంలోని జనసేన పార్టీని ఆదరించాలని కోరారు. అధికారంలోకి వస్తే అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాప్తాడు ఇన్‌ఛార్జి సాకే పవన్‌కుమార్, నగర అధ్యక్షులు పొదిలి బాబురావు, జిల్లా ఉపాధ్యక్షులు అంకే ఈశ్వరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శులు కుమ్మర నాగేంద్ర, కార్యదర్శులు కిరణ్‌కుమార్, ముప్పూరి కృష్ణ, నగర ఉపాధ్యక్షులు జక్కిరెడ్డి ఆదినారాయణ, నగర ప్రధాన కార్యదర్శులు మేదర వెంకటేష్, హుస్సేన్, నగర కార్యదర్శులు విశ్వనాథ్, వడ్డే వెంకటేష్, సంయుక్త కార్యదర్శి ఆకుల అశోక్, మండల అధ్యక్షులు తోట ఓబులేసు, కార్యక్రమాల కమిటీ సభ్యులు సంతోష్ నాయకులు రహీంబాషా, వీరమహిళలు పాల్గొన్నారు.

ఇనుప కమ్మీలు తొలగించాలని రాస్తారోకో

రాయదుర్గం : పట్టణంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహం ఎదుట రోడ్డుపై ఉన్న ఇనుప కమ్మీలను తొలగించాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో శనివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగార్జున మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్ స్తంభాన్ని తొలగించినప్పటికీ అడుగుభాగాన ఉన్న రెండు స్తంభాలను రోడ్డుపై వదిలివేశారన్నారు. దీంతో ప్రజలు, వాహనచోదకులు గాయాలపాలవుతున్నారన్నారు. వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ తాలూకా అధ్యక్షుడు ఎస్‌వి ఆంజనేయులు, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆంజనేయులు, సిపిఐ నాయకులు గురుస్వామి నరసింహులు, నిరంజన్, దుర్గన్న, తదితరులు పాల్గొన్నారు.

18న కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఉరవకొండ : సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18న కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.చిరంజీవి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున హాస్టళ్లలో వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ చేపట్టనున్న ధర్నాలో విద్యార్థులు భారీగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ నాయకులు రాజేష్, చిరంజీవి, ప్రవీణ్, ప్రణయ్, ఆకాష్, తదితరులు పాల్గొన్నారు.

నేమకల్లు అంజన్నకు పూజలు


బొమ్మనహాల్ : మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయమే స్వామివారికి పన్నీటి స్నానాలు ఆచరించారు. తర్వాత వెండి కవచం, సువర్ణ కిరీటాన్ని ధరించి తమలపాకల పూజ చేశారు. ఆలయ దర్శనార్థం వచ్చిన భక్తులకు అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో ఉచిత ప్రసాదం అందజేసినట్లు అన్నదాన కమిటీ అధ్యక్షులు రామాంజనేయులు తెలిపారు . ఈ కార్యక్రమంలో సర్పంచి పరమేశ్వర, ఆలయ అధికారి ఓబన్న, తదితరులు పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయాలి

బుక్కరాయసముద్రం : డీలర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విజయవాడలో నిర్వహించనున్న మహాసభను విజయవంతం చేయాలని స్టోర్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బాలనాగిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత డీలర్ల సమస్యలు ఎక్కువయ్యాయన్నారఉ. వెంటనే డీలర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలో స్టోర్ డీలర్ల అధ్యక్షులు పూల రంగనాథ్, ఉపాధ్యక్షులు సాకే లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శి పురుషోత్తం, డీలర్లు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

'జగనన్న సురక్ష'లో నాయకులు



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత వైసిపికే దక్కుతుందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. శనివారం నగరంలోని 9, 10, 23, 24, 25, 26, 39 డివిజన్లు, అనంతపురం రూరల్-1 పరిధిలో 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచినా ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం, ఏ ముఖ్యమంత్రి అందించని విధంగా ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక సిఎం జగన్ అన్నారు. పిల్లల ఉజ్వల భవిష్యత్ గురించి ఆలోచిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదని చెప్పారు. నాలుగేళ్లలో ఏకంగా రూ.3లక్షల కోట్లను సంక్షేమం కోసం వెచ్చించామన్నారు. ప్రస్తుతం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు 11 రకాల సేవలను ఉచితంగా అందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాల్లో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, అహుడా ఛైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, మాజీ మేయర్ రాగే పరశురాం, మార్కెట్ యార్డ్ వైస్‌ఛైర్మన్ ఓబిరెడ్డి, జెసిఎస్ కన్వీనర్లు లక్ష్మన్న, చింతకుంట మధు, ఆలుమూరు శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్లు ఎం.దేవి, వై.లక్ష్మీదేవి, సుమతి, బాబా ఫకద్దీన్, లీలావతి, రామాంజనేయులు, మీనాక్షమ్మ, ఇషాక్, హారిత, సర్పంచి ఉదయ్, ఉప సర్పంచి సుమిత్రా, ఎంపిటిసి ఆశాజ్యోతి, మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లా బేగ్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొర్రపాడు హుస్సేన్ పీరా, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : రాష్ట్రంలో సిఎం జగన్ అందిస్తున్న పాలన దేశానికే ఆదర్శమని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శనివారం ఉరవకొండ సచివాలయం-2 పరిధిలో 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. గ్రామా క్షేత్రస్థాయిలో ప్రభుత్వం అందిస్తున్న సేవలు సంతృప్తికరంగా ఉన్నాయని వివరించారు. గతంలో జన్మభూమి కమిటీల సిఫార్సు ఉంటేనే ప్రజలకు సేవలు అందేవని కానీ జగనన్న పాలనలో ఇళ్లవద్దకే అన్ని రకాల సర్టిఫికెట్లు, సంక్షేమ పథకాలు నేరుగా అందుతున్నాయన్నారు. మండలంలో కొద్దిరోజుల్లోనే 5 వేల మందికి 11 రకాల ధ్రువీకరణ పత్రాలు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి లలిత, ఎంపిపి చంద్రమ్మ, జెడ్పిటిసి పార్వతమ్మ, ఉప సర్పంచి వన్నప్ప, సచివాలయ కన్వీనర్లు పద్మావతి, ఈడిగా ప్రసాద్, మద్దికెర అన్వర్, పంచాయతీ రాజ్ జిల్లా అధ్యక్షుడు బసవరాజు, జెసిఎస్ కన్వీనర్ అసీఫ్, ఎంపిడిఒ చంద్రమౌళి, ఎంఎల్‌ఒ ఓబులేసు, సచివాలయ సిబ్బంది, గృహసారథులు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

శెట్టూరు : మండలంలోని యాటకల్లు గ్రామంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎంపిడిఒ మైథిలి, సర్పంచి ఈరన్న కలిసి పలువురికి ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు రామ, భీమప్ప, తిమ్మరాజు పంచాయతీ కార్యదర్శి మంజుల, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : పట్టణంలోని 16, 17వ సచివాలయాల పరిధిలో ఉన్న చంద్రబాబు పార్కులో, 1, 18వ సచివాలయాలకు సంబంధించి పార్వతీనగర్ సచివాలయం వద్ద శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా సిఎం జగన్ చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలను తెలుసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం అధ్యక్షురాలు పొరాళు శిల్ప, డిప్యూటీ కలెక్టర్ వరప్రసాద్, కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి, వైస్‌ఛైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, వార్డు సభ్యులు ఉషా, భాగ్యలక్ష్మి, గోవిందరాజులు, నాగవేణి, శారద, శ్రీలక్ష్మి, ఫక్రుద్దీన్, వన్నూరప్ప, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌ఛార్జిలు శివ, శివప్ప, దివాకర్, గంగాధర్, సత్యనారాయణ, రిబ్కా, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, పట్టణ కన్వీనర్ ముస్తాక్, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

గార్లదిన్నె : మండల పరిధిలోని పెనకచెర్ల, బుదేడు గ్రామాలో తహాశీల్దార్ ఉషారాణి ఆధ్వర్యంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా లబ్ధిదారులకు 1098 రకాల సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పరిగి : ప్రజల చెంతకే పాలన అనే కోణంలో సిఎం జగన్ సుపరిపాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే శంకరనారా యణ పేర్కొన్నారు. మండల పరిధిలోని పి.నరసాపురం పంచాయతీలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే లబ్ధిదారులకు 2,250 సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024లో వైసిపి 175 స్థానాలు గెలవడం ఖాయని ధీమా వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోనే ప్రతి పేదవాడి సమస్యను తెలుసుకుని తక్షణ పరిష్కారం చేయాలని ఉద్దేశంతోనే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తుందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఎన్.కొత్తపల్లి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు త్వరితగతిన చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహాశీల్దార్ సౌజన్యలక్ష్మి, ఎంపీడీవో సరస్వతి, సర్పంచి సరస్వతి, వైసిపి నాయకులు ప్రభాకర్, అరుణ్‌రెడ్డి, రామచంద్ర, శివశంకర్, పలువురు పాల్గొన్నారు.

కొత్తచెరువు : 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి విజయ్‌కుమార్ రెడ్డి సూచించారు. మండల పరిధిలోని తలమర్ల గ్రామ సచివాలయం వద్ద 'జగనన్న సురక్ష' గ్రామసభ నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై 1100 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ శివరంగప్రసాద్, ఎంపీడీవో సిద్ధారెడ్డి, తహాశీల్దార్ రామాంజనేయరెడ్డి, ఏవో నటరాజు, ఎంపీపీ గాయత్రి రెడ్డప్పరెడ్డి, అగ్రి అడ్వైజర్ కమిటీ మండల ఛైర్మన్ ప్రమీల శ్యాంసుందర్ రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ జగన్మోహన్‌రెడ్డి, సర్పంచి రత్నమ్మ, జడ్పిటిసి గంగాదేవి, వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : 'జగనన్న సురక్ష' ద్వారా ఎంతోమంది పేద, మధ్యతరగతి ప్రజలకు లబ్ధి చేకూరుతుందని తహాశీల్దార్ నవీన్ కుమార్ పేర్కొన్నారు. మండల పరిధిలోని వెంకటగారిపల్లిలో సర్పంచి లక్ష్మీదేవి అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్ష గ్రామసభలో వైసిపి మండల మాజీ కన్వీనర్ గంగాధర్ 1000 మందికి పైగా లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో అశోక్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ ఏవి రమణా రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ శుభదాసు, సచివాలయాల కన్వీనర్ మల్లికార్జున, అగ్రి అడ్వైజరీ కమిటీ సభ్యుడు సూర్య నారాయణరెడ్డి, ఎంపీటీసీ, ప్రజలు పాల్గొన్నారు.

బుక్కపట్నం : 'జగనన్న సురక్ష'ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని సమస్యలు పరిష్కరించుకోవాలని సర్పంచి నాగలక్ష్మిరాజు, ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, అగ్రి అడ్వైజర్ ఛైర్మన్ రమణారెడ్డి తెలిపారు. బుక్కపట్నంలో సర్పంచి అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారులకు వివిధ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ రాజశేఖర్ రెడ్డి, జడ్పిటిసి శ్రీలత గోవర్ధన్ రెడ్డి, తహాశీల్దార్ కరుణాకర్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఈవోఆర్‌డి ఇందిరాబాల, వైస్ ఎంపీపీ పార్వతి, కన్వీనర్ సుధాకర్ రెడ్డి, నాయకులు పతాంజలి, నారాయణస్వామి, నాగభూషణ, మహేష్, మల్లికార్జున, ఈశ్వర్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపిపి గొడ్డుమర్రి ఆదినారాయణ యాదవ్ తెలిపారు. మండల పరిధిలోని బుదనాంపల్లి గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మండల అధికారులు ఎంపీటీసీ వెంకటశివారెడ్డి, సర్పంచి వెంగల్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : సచివాలయం-2 పరిధిలోని మరువకొత్తపల్లిలో నిర్వహించిన 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో లబ్ధిదారులకు 1230 సర్టిఫికెట్లు పంపిణీ చేసినట్లు ఎంపిపి పురుషోత్తమరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయ కులు రామక్రిష్ణారెడ్డి, హరీష్, చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సీనియర్ నాయకుడు మృతి

అమరాపురం : మండల పరిధిలోని హలుకూరు గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు కృష్ణమూర్తి(52) అనారోగ్యం తో బాధపడుతూ బెంగళూరులో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈయన కుటుంబాన్ని పార్టీ అన్ని విధాలా ఆదుకుంటుందని మాజీ ఎమ్మెల్యే ఈరన్న తెలిపారు. ఆయన వెంట నాయకులు శ్రీనివాస్, నాగమ్మ, ప్రకాష్‌గౌడ్, హనుమంతరావు, ప్రకాష్, గోవిందరాయ కంచప్ప ఉన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం

పెనుకొండ : పట్టణంలోని సమత ఎన్జీవో కార్యాలయంలో శ్రీసత్య సాయి డిగ్రీ కళాశాల తృతీయ సంవత్సరం బిజెడ్‌సి ఇంటర్‌షిప్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు శనివారం సేంద్రియ పుట్టగొడుగుల పెంపకం ఉత్పత్తులు తయారీ మార్కెట్లపై సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు కేశవయ్య, అశోక్, పుట్టగొడుగుల పెంపకం శిక్షణ నిపుణులు ఎం.భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

18న 'ఆశా' కార్యకర్తల ధర్నా

హిందూపురం : ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప హెచ్చరించారు. ఈ నెల 18న జిల్లా వైద్యాధికారి కార్యాలయం ముందు జరిగే ధర్నాలో ఆశా కార్యకర్తలు పాల్గొనేందుకు అనుమతులు ఇవ్వాలని కోరుతూ శనివారం పట్టణంలోని బోయపేట, లక్ష్మీపురం పిహెచ్‌సి కేంద్ర వైద్యాధికారులకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హిందూపురం ఆశా వర్కర్స్ యూనియన్ కార్యదర్శి మమతమ్మ, జానకి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయంపై అర్చకుల హర్షం

ఉరవకొండ : అర్చకులకు మేలు జరిగే విధంగా సిఎం జగన్ క్యాబినెట్‌లో తీర్మానం చేయడం పట్ల పెన్నఅహోబిలం ఆలయ అర్చకులు, అర్చక సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎఎన్ ద్వారకనాథాచార్యులు, అర్చక సమాఖ్య జిల్లా కోశాధికారి మయూరం బాలాజీ చార్యులు, సభ్యులు జి.గుండురావు, జె.సత్యనారాయణ, కె.రామకృష్ణారావు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం స్థానిక ఆలయంలో విలేకరులతో మాట్లాడుతూ అర్చక వృత్తికి బ్రాహ్మణులు దూరమవుతున్న సమయంలో సిఎం తీసుకున్న నిర్ణయం హర్షించదగ్గదన్నారు. ప్రధానంగా అర్చకులకు వంశపారంపర్య హక్కులు, జీతాల పెంపు, వయోపరిమితి పెంపునకు సంబంధించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం ఎంతో గొప్పదన్నారు. అర్చకుల మదిలో ఆయన ఎప్పుడూ నిలిచి ఉంటారన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న అర్చకులు